# సింగిల్ పేజీ కథలు

## శిక్ష

**"నువ్వూరుకో! దానికా సిచ్చ పడాల్సిందే! నాయాల్ది వొళ్ళు కొవ్వెక్కి సత్తావుండాది. ప్రతి దానికి ఎగబడతాది...మొన్న లచ్చుమయ్య గారి చేలో పడి జున్ను గడ్డి అంతా తొక్కేసింది. పొద్దుటేమో నూనెయ్య దొడ్లోపడి కూరగాయ మొక్కలన్నీ పాడు చేసింది. దీన్ని రామ...రామ అనకూడదే!" రంగమ్మ అడ్డు వస్తున్నా చింతబరికెతో వీరవిహారం చేస్తు న్నాడు వీరయ్య.**

"ఓరి..వూరుకోరయ్యా! మూగ గొడ్డుపై నీ పెతాపం సూపిస్తున్నావే! అదేటి సేసింది. దానికి కమ్మగా కుడితి పెట్టితివాయె! దీన్నేమో పరగడుపున వుంచినావు గదా! ఇనప కట్ట ఎత్తేదానికి ఎత్తావుగాని, గమిడి దానికి



ఎయ్యావ్. నీ పచ్చపాత బుద్ధి మూలకంగానే అదట్లా నిన్నే ఎదిరిస్తుంది. ఏ గొడ్డయితే మాత్రం సంవత్సరం పాడు గూతా పాలిచ్చుద్దేంటి? చాలుగాని నీ పెతాపం బువ్వ తిందువుగాని రా! ఆనక పాలమెళ్ళి జున్ను గడ్డి కోసుకు రావాల!"

గమిడి గేదెని కొట్టకుండా వీరయ్యకు అడ్డొచ్చింది రంగమ్మ. ఆ గేదె వైపు రుస, రుసా చూస్తూ సావిట్లో నుంచి బయటకు వచ్చేడు.

వీరయ్యకి రెండు గేదెలున్నాయి. రెండూ ఆ దొడ్లో పుట్టి పెరిగినవే! ఒకటి పొట్టి కొమ్ముల గేదె, రెండోది గమిడి గేదె. గమిడి గేదె ఈమధ్యనే పాలివ్వడం మానే సింది. పొట్టికొమ్ముల గేదె మొన్నీమధ్యనే ఈని పెయ్యి దూడని కనేసింది.

మొదట్నించీ పొట్టికొమ్ముల గేదంటేనే వీరయ్యకి మక్కువ. దాని వొంటిమీద ఈగ వాలనివ్వడు. అది ప్రస్తుతం పాడి గేదె కావడం, గమిడి గేదె పాలివ్వకపోవ డంతో పొట్టికొమ్ముల గేదె మీద మమకారం ఎక్కువైంది.

పాడి గేదెకి తవుడు నీళ్ళలో కలిపి కుడితి పెట్టాడు. గమిడి గేదె కట్టు తెంచుకుని పాడి గేదెతో కలియబడి కుడితంతా తాగేసింది. గమిడి గేదెని చూస్తే పొట్టికొమ్ముల గేదెకి భయం.

అది చూసి వీరయ్యకి వొళ్ళు మండింది. నల్లగా, ఎత్తుగా, బలిసిన దున్నపోతులా వుండే గమిడి గేదె ఒక పట్టాన లొంగకపోవడంతో, ఇనుప గొలుసు కొనుక్కొచ్చి సావిట్లో కట్టేసేడు. ఇక తన కోపమంతా దానిమీద చూపిం చడం మొదలుపెట్టాడు.

* * *

సాయంత్రం నాలుగైనా ఎండ తగ్గుముఖం పట్ట లేదు. వెచ్చటి వడగాలి హోరుమని వీస్తున్నది.

తలచుట్టూ తలగుడ్డ చుట్టుకుని, నెత్తిమీద జున్ను గడ్డి మోపుతో బందరు కాలువగట్టుపై నడుస్తున్నాడు వీరయ్య. కాలువలో ఒక్క చుక్క నీరు లేదు.

ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా నడుస్తున్న వీరయ్యకి ఎదురుగా లంక వైపు మంటలు కన్పించడంతో ఉలిక్కిప డ్డాడు.

లంకలో ఇళ్ళు తగలబడి పోతున్నాయి.

నడక వేగం పెంచాడు.

అలివిగాని మంటలు, జనం కేకలు, ఇళ్ళు కాలిపో యిన వాళ్ళ పెడబొబ్బలు. ఫట్..ఫట్ మని కాలిపోతున్న వాసాల శబ్దాలతో లంకంతా గందరగోళంగా వుంది.

ఇళ్ళలో సామాన్లన్నీ రోడ్డు మీదకు చేరుకుంటు న్నాయి. అందినవి అందినట్లుగా తెచ్చి రోడ్డు మీద పడే స్తున్నారు. రోడ్డు మీద అస్తవ్యస్తంగా పడివున్న సామాను వైపు చూడాలో, కాలిపోతున్న తమ ఇళ్ళవైపు చూడాలో అర్థంగాక గుండెలు పగిలేటట్లు ఏడుస్తున్నారు కొందరు ఆడవాళ్ళు. కొంతమంది యువకులు ప్రాణాలకు తెగించి ఇంటి కప్పుల పై చేరి నీళ్ళు చల్లుతున్నారు. మరి కొంతమంది వినోదంగా ఒక్కొక్క ఇంటిని చూస్తూ ముందుకు పరుగెత్తుతున్నారు.

ఇళ్ళ పక్కనున్న పచ్చని చెట్లు కూడా మల మల మాడిపోతున్నాయి. ఇళ్ళు, సావిడ్లు, గడ్డివాములు, వడ్ల పురులు-ఒకటేమిటి సర్వం పరుశురామప్రీతి అవుతు న్నాయి.

వీరయ్య దృష్టి వేప చెట్టుపై పడింది. ఆ చెట్టుపై కాకి గూడు వుంది. అందులో చిన్న పిల్లలున్నాయి. ఒక ప్రక్కన చెట్టుకు నిప్పంటుకుంది. తల్లి కాకి చెట్టుపై ప్రద క్షిణాలు చేస్తున్నది. ఎండు పుల్లలతో వున్న కాకి గూడుకు కొన్ని క్షణాలలోనే నిప్పంటుకుంది. కాకి పెద్దగా అరుస్తూ గూడుపైన ప్రదక్షిణాలు చేసింది. దాని కళ్ళముందే కాకి పిల్లలు మాడిపోయాయి.

వీరయ్యకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఏంటి మామా! నువ్విక్కడే నిలబడ్డావ్..మీ సావిడికి నిప్పంటుకుంది. తొందరగా వెళ్ళు!" నర్సిగాడు వీర య్యకి ఆ కబురందించి అక్కడ నిలబడకుండా వెంటనే మరో దిక్కుకు పరుగెత్తాడు.

అప్పటికే సావిడి కప్పు పూర్తిగా పరుశురామప్రీతి అయ్యింది. కప్పు కూలేందుకు సిద్ధంగా వుంది.

పొట్టి కొమ్ములగేదె తాడు ఎవరో కొడవలితో కొయ్య డంతో ఆ గేదె బయటపడింది. ఇద్దరు ముగ్గురు గమిడి

గేదె గొలుసు విప్పదియ్యాలని ప్రయత్నించారు. కానీ అది రాలేదు. ఆ మంటల సెగకి తట్టుకోలేక సావిడి లోపల వాళ్ళు బయటకు వచ్చేసేరు.

వీరయ్య పిచ్చి ఆవేశంతో గమిడి గేదె దగ్గరకు వెళ్ళాడు మంటల సెగకు తట్టుకోలేక గమిడిగేదె కట్టు కొయ్య చుట్టూ చిందులు వెయ్యడం మొదలుపెట్టింది. వీరయ్య ఎంత ప్రయత్నించినా గొలుసు వూడి రాలేదు. కప్పు కూలేందుకు సిద్ధంగా వుంది.

సావిడి బయట జనం కేకలు పెట్టడం మొదలుపెట్టారు. వీరయ్య ఎంతసేపటికి బయటకు రాకపోవడం చూచి ఇద్దరు లోపలకి వెళ్ళి బలవంతంగా వీరయ్యను బయటకు లాక్కొచ్చారు.

కప్పుకూలింది.

గమిడి గేదె పెద్దగా అరుస్తూ ప్రాణాలను విడిచింది.

రంగమ్మ శోకాలు మొదలుపెట్టింది.

"నీ కసి తీరిందిగా..ఎప్పుడూ లేంది దాన్ని ఇనుప గొలుసుతో కట్టేశావ్..పొద్దున్న దాన్ని సావబాదావ్! దానికి సిచ్చ పడాలన్నావుగా! మంచి సిచ్చేపడింది"

వీరయ్యకు నోటివెంట మాట రాలేదు.

**-బద్దిగం పాండురంగారెడ్డి**

(కరీంనగర్)

# చీర

**శివశంకర్ స్టేషన్‌కు చేరేసరికే ట్రైన్ ఆగివుంది. ఓ ప్రక్క చల్లని శీత గాలులు వీస్తున్నప్పటికీ చిరుచెమటలు పట్టాయి అతని నుదుట మీద. గబగబా ఒక్కో బోగీ చూసుకుంటూ గార్డు కంపార్ట్‌మెంట్ దాకా వెళ్లేడు. తిరిగి అన్ని బోగీలు చూస్తూ ప్లాట్‌ఫారం అంతా కలియజూసేడు.**

'వస్తానందే..రాలేదా? నేను రాలేదని ఆటోలో గాని ఇంటికి వెళ్లిపోయిందా' అంతరంగంలో మధనం. మరోసారి ప్లాట్‌ఫారం అంతా చూసి వెనుదిరిగాడు శివశంకర్. వీధి మలుపు తిరిగేసరికి ఇంట్లో లైట్లు వెలుగుతూ కిటికీ లోంచి కనిపించాయి. 'హమ్మయ్య వచ్చేసిందా' అనుకుంటూ గబగబా చేరి..

"సౌదా..సౌదా..వచ్చేసావా..నేను వస్తానన్నాగా..ఓ క్షణం వెయిట్ చెయ్యలేకపోయావా"

"ఆ ..తమరు ఎ.సి.కారు తీసుకొని వస్తారనీ నిరీక్షిస్తూ వుండేదాన్ని"

"అదేంటి సౌదా..అంత కోపంగా వున్నావు. ఒక్కక్షణం ఆలస్యం అయినందుకే అంత కోపమా" అని బ్రతిమాలే ధోరణిలో అన్నప్పటికీ ఆమె ఇసుమంతైనా జాలి చూపలేదు.

అసలే తెల్లగా వుండేమో కోపంతో ఆమె కళ్లు..బుగ్గలు ఎరుపెక్కేయి.

ఆమెను కోపం మూడ్‌లోంచి జాలీ మూడ్‌లోకి తేవాలనుకొని "అనుర సంధ్యవేళ..ఉసురు తగలనీకుమా దేవీ" అంటూ పాట అందుకున్నాడు. "ఆపుతారా మీ కాకిగోల మీరేం ఎస్.పి. అనుకున్నారా ఏం" అంటూ రుసరుసలాడింది.

"ఆయన ఒక్క ఎస్.పి. నే.. నేను ఎస్.ఎస్.పి. మేడం..అంటే శివశంకర్ ప్రసాద్" అన్నాడు నవ్వుతూ..మాటలు మారుస్తూ.. "ఇంతకీ సంక్రాంతి పండగ బాగా జరిగిందా"

"ఆ..జరగదూ..తమరు రానంత మాత్రాన పండగ ఆగిపోతుందా..ఏం..."

"సారీరా..వద్దామనే అనుకున్నా. నీకు తెలీనిదేముంది చివరి క్షణంలో బాస్ పని అప్పజెప్పాడు. అందుకే నేను మరి రాలేక చీర పంపించేసా..బాగుందా?"

"ఆహా..అదో చీర..మీదో టేస్టు. సిగ్గు సిగ్గు ఆ చీర కట్టుకుంటే..వీధిలోకి తోటకూర అమ్మేదీ..అలాంటి చీరే..ఇవాళ ట్రైన్‌లో శనగకాయలమ్మేది అదే చీర...గొప్ప చీర పంపారు" అనేసరికి పాపం తలవంచుకున్నాడు శివశంకర్.



ఆ రాత్రంతా ముభావమే..ఒకటి రెండుసార్లు చెయ్యి వేసినా పాపం కనికరించకపోయేసరికి మూడంకె వేసి నిద్రలోకి జారుకున్నాడు. తెల్లారినా ప్రతికూల వాతావరణమే..సహాయ నిరాకరణే...మౌన పోరాటమే....ఇక ఈ మౌన పోరాటాన్ని భరించలేక క్షమాపణల మంత్రాలను వల్లె వేసి ప్రాధేయపడగానే కొంచెం చలించింది. హమ్మయ్య అనుకొని కంటిన్యూ చేసాడు. "సౌదా..నన్ను క్షమించు. ఇక మీదట నీకు నచ్చిన చీర నువ్వే ఎంచుకో. ఎంత ఖరీదైనా ఫరవాలేదు. అంతేకాని ఇలా మౌనంగా వుంటే నేనుండలేను" అనేసరికి సౌదామని మనస్సు కరిగి లేచి గబగబా గదిలోకి వెళ్లి బీరువాలోంచి చీరని తీసుకొని వచ్చి, "ఈ చీర చూడండి, ఎంత బాగుందో, మా పుట్టింటి వారు పెట్టింది. ఈ రంగు చీర మా వీధిలో ఎవ్వరి దగ్గరా లేదు" అంది మురిసిపోతూ చీరని చూపిస్తూ.

"చాలా బాగుందిరా" అంటూ కౌగిలిలోకి లాక్కున్నాడామెను.

★ ★ ★

ప్రతిరోజు ఆఫీసు నుంచి అరగంట ఆలస్యంగా వచ్చే తను ఆరోజు ఓ గంట ముందుగానే వచ్చేసాడు. గుమ్మంలోకి అడుగుపెట్టేసరికి..

ఇంట్లోంచి పనిమనిషి బయటకు వచ్చింది. ఓ క్షణం నోరుతెరిచి కళ్లు పెద్దవి చేసి అలా ఓ నిముషం ఆమెనే చూస్తూ లోపలికి అడుగుపెట్టి "సౌదా..సౌదా..ఏంటోయ్ మీ పుట్టింటి వారిచ్చిన చీర పనిమనిషికిచ్చేసావు. అప్పుడే అది సింగారించేసింది కూడానా.." అనేసరికి.

"అదీ అలాంటి చీరే కొనుక్కుందండీ"

మూతి సున్నాలా చుట్టి, మాటలు సాగదీసి చెప్తూ తలవంచుకొని అతని గుండెల్లో దూరిపోయింది సౌదా..ఉరఫ్ సౌదామని.

**-భళ్ళమూడి నాగరాజు**

(రాయగడ, ఒరిస్సా)